www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఇంధన భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని డివిజన్లలో ఇంధన భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో భద్రత వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ బి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యుత్ భద్రత వారోత్సవాలు జిల్లాలో అన్ని డివిజన్లలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్నా యన్నారు. జూలై 2వ తేదితో భద్రత వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ నేపథ్యంలో వినియో గదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ సోమశేఖర్ రెడ్డి, జయ కష్ణా రెడ్డి,విజయ్, వరదయ్య, మధు,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ బాల చంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

పసిబిడ్డలతో నీచపు వ్యాపారం..!

ఆరోగ్యశ్రీ పేద, నిరుపేదల రోగులకు వరం లాంటింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం ఇప్పుడు అస్తవ్యస్తంగా మారుతోంది. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దీనిని బాగా అమలు చేస్తామని చెప్పి నీరుగార్చుతున్నారు. గతంలో 2,446 రకాల చికిత్సలు వర్తిస్తుండగా, జగన్ అది . కారంలోకి వచ్చాక అధనంగా మరో 700 చికిత్సలను ఆరోగ్య శ్రీ కిందకు చేర్చారు. 3,166 చికిత్సలు ఆరోగ్యశ్రీలో ఉన్నాయి. వెయ్యి రూపాయలు బిల్లు దాటితే ఆరోగ్యశ్రీ కింద చేర్చుతామని చెబుతోన్న మాటలు మొత్తం గారడీగా కనిపిస్తోంది. ఆరోగ్యశ్రీ నుంచి అనేక ఆస్పత్రులు వెళ్లిపోయాయి. నెల్లూరు నగరంలోని ఓ చిన్నపిల్లల ఆసుపత్రి పసిబిడ్డలతో నీచపు వ్యాపారం చేస్తుంది. డైఫర్లు ఆయిల్, మందులు అమ్ము కుంటున్నా, ఆరోగ్యశ్రీ పెడుతూ, మరోవైపు తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు బిల్లులు తీసుకుంటుంది. ఆరోగ్యశ్రీ అధికారులు నోరు మెదపడం లేదు..

- ఆరోగ్యశ్రీ పేరుతో అక్రమాలు
- డైపర్లు, ఆయిల్ అమ్ముకుంటున్న చిన్నపిల్లల వైద్యశాల
- ఆరోగ్యశ్రీ అధికారులు గఫ్‌చుప్
- కన్నీళ్లు పెడుతోన్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆరోగ్యశ్రీ పథకం నీరుగారిపోతుంది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఇక్కడ అమలు జరగడం లేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పలు కార్పొరేట్ ఆసుపత్రులు అపోలో, కిమ్స్‌తోపాటు అనేక పెద్ద ఆస్పత్రులు వెళ్లిపోయాయి. ఈ పథకాన్ని అడ్డంపెట్టుకొని నగరంలోని పొగతోటలో ఓ చిన్నపిల్లల ఆసుపత్రి భారీగా వ్యాపారం చేస్తుంది. చిన్నపిల్లలను అడ్డంపెట్టకొని చిల్లర వ్యాపారం చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా వైద్యులతో ఈ ఆస్పత్రికి ఒప్పందాలున్నాయి. ఎక్కడైనా పుట్టిన బిడ్డకు ఇబ్బందులుంటే కామెర్లు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నా వెంటనే అంబులెన్స్ మాట్లాడి నెల్లూరు నగరంలోని ఆ ఆస్పత్రికి పంపుతున్నారు. ఎక్కడ నుంచి వచ్చారు. ఏ డాక్టర్ పంపారో తెలుసుకుంటున్నారు. పిల్లలను తీసుకొచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ వర్తించాల్సి ఉంటుంది. ఆరోగ్యశ్రీ వర్తిస్తుందో లేదో చెప్పలేమని, ముందు నగదు చెల్లించాలని తల్లిదండ్రులను డిమాండ్ చేస్తున్నారు. ఐసియులో బాక్స్‌లో పెట్టాలని ఇప్పుడే ఏం చెప్పలేమని తల్లిదండ్రులను భయపెడుతున్నారు. ఎక్కడో ఒకచోట నగదు తీసుకొస్తున్నారు. కొందరు తల్లులు తమ బిడ్డల ప్రాణాలు కాపాడుకోడానికి తాళిబొట్టులు తాకట్టుపెడుతున్నారు. రెండు రోజులు వివిధ రకాల పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నారు. తరువాత ఆరోగ్యశ్రీ పెడుతున్నామని అనుమతి వచ్చేవరకు బిడ్డను ఇవ్వవని తిరకాసు పెడుతున్నారు. ఇలా ఒక్కో పిల్లవాడిని వారం, పదిరోజులు ఐసియులోనే పెడుతున్నారు. వివిధ రకాల ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఉందని కదా అంటే మంచి వైద్యం, మెరుగైన పరికరాలు ఉపయోగించాలని మీరు డబ్బులు చెల్లించాల్సిందేనని మెలిక పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద కనీసం రూ.35 వేలు బిల్లులు పెడుతుండగా, తల్లిదండ్రుల నుంచి మరో రూ.20 నుంచి రూ.25 వేలు వివిధ రకాల పేరుతో బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. ఏమి మాట్లాడితే ఏం జరుగుతుందోననే భయంతో తల్లిదండ్రులు అప్పులు తెస్తున్నారు. తాళిబొట్లు కుదవు పెడుతున్నారు. జగన్ ఆరోగ్యశ్రీ మాటున చిన్నపిల్లల ఆస్పత్రి చేస్తున్న నీచపు వ్యాపారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

డైపర్లు, ఆయిల్, మందులు కొట్టేస్తున్నారు..!

పొగతోటలోని ఆ చిన్నపిల్లల ఆస్పత్రి ఆరోగ్యశ్రీ పథకం పెట్టడంతోపాటు, సొంత వ్యాపారం చేసుకుంటున్నారు. ఐసియులో ఉండే చిన్నారులకు ప్రతి రోజూ డైపర్లు, శరీరం తుడిచే ఆయిల్, మందులు రాస్తున్నారు. మెడికల్ షాపు నుంచి కొనుగోలు చేసి ఆస్పత్రి సిబ్బందికి అందజేస్తున్నారు. ఐసియులో ఏ వైద్యం జరుగుతుందో తెలీదు. కొద్ది సేపటికే డైపర్లు, ఆయిల్స్, మందులు వెనుక నుంచి బాక్స్‌ల్లో మళ్లీ సొంత మెడికల్ షాపునకు చేరుతున్నాయి. ఇదంతా తల్లిదండ్రులు, కళ్ల ముందు జరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐసియులోకి వెళ్లి మందులు అనేక దఫాలుగా మందుల షాపుల్లో చేరుతున్నాయి. ఈ ఆస్పత్రి అవినీతి బాగోతం చూసి కన్నీళ్లు పెడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే చికిత్స పొందుతున్న తమ బిడ్డలకు ఏ ప్రమాదం వస్తుందోనని భయపడిపోతున్నారు. జగన్ మాటలకు అక్కడ జరుగుతున్న తంతుకు తల్లిదండ్రులు, వారి బంధువులు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. చికిత్స అనంతరం మరో ఆసుపత్రికి వెళ్లకుండా పిల్లవాడికి పూర్తిగా నయం కాలేదని, వారం వారం ఆసుపత్రికి తీసుకురావాలని, ప్రతి సారి పరీక్షల కోసం ఐదు వేలు తెచ్చుకోవాలని వైద్యులు సెలవిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆరోగ్యశ్రీ అధికారులు గఫ్‌చుప్‌గా ఉన్నారు.

ఆరోగ్యశ్రీ అధికారుల మొద్దు నిద్ర..!

ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరును పరిశీలించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ ఏం జరుగుతుందో తెలిసినా నోరు మెదపడం లేదు. ఆసుపత్రి ఇచ్చే తాయిలాలకు అలవాటు పడి మౌనంగా ఉంటున్నారు. చికిత్స అనంతరం తల్లిదండ్రులు పిల్లలను ఇళ్లకు తీసుకెళుతున్నారు. ఆ సమయంలో ఆసుపత్రిలో చెల్లించిన బిల్లులు తిరిగి ఇస్తున్నామని నటిస్తున్నారు. ఆరోగ్యశ్రీ అధికారుల ముందు మీరు చెల్లించిన డబ్బులు ఆసుపత్రి సిబ్బందికి చెల్లించారా ? అని ఆసుపత్రి దక్కర్లు, సిబ్బంది ముందు ప్రశ్నిస్తున్నారు. వారి ముందు నగదు ఇస్తున్నారు . ఆరోగ్యశ్రీ సిబ్బంది వెళ్లిన తరువాత మళ్లీ నగదు తిరిగి తీసుకొని పంపుతున్నారు. ఈ ఆసుపత్రిలో జరుగుతోన్న అవినీతి, అక్రమాలకు తల్లిదండ్రులకు తెలిసినా మౌనంగా భరిస్తున్నారు. తమ పిల్లలకు ఏం జరుగుతుందోనని భయపడిపోతున్నారు. ఉన్నతాధి కారులు ఇక్కడ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వారికి విచారణ చేస్తే మరిన్నీ వాస్తవాలు బయటపడుతాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులు ఏం చేస్తారో చూడాలి.

నేతలు, కార్యకర్తలతో
టిడిపి నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమావేశం

'యువగళం' విజయవంతం చేద్దాం..!

2న నియోజవర్గంలో ఎంట్రీ : కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కార్యక్రమాన్ని విజయ వంతంచేయాలని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కార్యాలయంలో యువగళం సన్నాహక సమా వేశం ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలతో పాటు టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశంలో పాల్గొన్నారు. పాదయాత్రను నభూతో, నభవిష్యత్ అన్న రీతిలో నెల్లూరులో జరగాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరగదు. ఇకపై జరగకూడదన్న చందంగా జరుగుతుందని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జూలై 2న కాకుపల్లి వద్ద నెల్లూరు రూరల్ నియోజవర్గంలో ప్రవేశిస్తుం దన్నారు. టిడిపి నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి శ్రీకాంత్

రీ సర్వే చేయండి : శ్రీకాంత్

ప్రజాశక్తి-కందుకూరు : ఒంగోలు జిల్లా పరిషత్‌లో బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లో ఎంఎల్‌సి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్థలాలను సర్వే చేయించి, వాటికి చుట్టూత ప్రహరీ గోడలు నిర్మిం చాలని శ్రీకాంత్ కోరారు.టిడిపి హయాంలో తాను జెడ్‌పిటిసి సంఘం సభ్యుల చైర్మన్ గా ఉన్నప్పుడు జిల్లాలో సుమారు 80శాతంం పాఠశాలలను సర్వే చేయించి ప్రహరీ గోడల నిర్మించామని తెలిపారు.

'అమ్మఒడి' నగదు జమ

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో 2022-23 ఏడాదికి సంబంధించి 1,94,842 మంది తల్లుల ఖాతాలకు రూ. 292.26 కోట్లు నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జమ చేశారని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ వెల్లడించారు. బుధవారం వరుసగా నాలుగో ఏడాది అమ్మఒడి నిధులను పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నుంచి ముఖ్యమంత్రి విడుదల చేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థుల కలలను సాకారం చేయడమే లక్ష్యంగా ఎక్కడా ఖర్చుకు వెనకాడకుండా ముఖ్యమంత్రి అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు.

చెక్కు ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

విద్యావ్యవస్థలో అనేక రకాల సంస్కరణలు అమలను చేస్తూ పేద విద్యార్థుల సంక్షేమానికి కషి చేస్తున్న ముఖ్య మంత్రికి విద్యార్థుల తల్లిదండ్రుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు రాకూడదని, ప్రతి తల్లి కూడా తమ బిడ్డలను చదివించాలనే ఆలోచన చేసేలా అమ్మఒడి పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. తొలుత అమ్మ ఒడి నగదుకు సంబంధించిన మెగా చెక్కును విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, డిప్యూటీ డీఈవో లక్ష్మీ ప్రసూన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైటింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పరిధిలోని పలు డివిజన్లలో స్ట్రీట్ లైటింగ్ కార్మికులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు వెలుగునందిస్తూ తమ జీవితాల ను చీకటిమయం చేసు కుంటున్నారని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌర వాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ స్ట్రీట్ లైటింగ్ కార్మికులు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ వీధిలైట్ల నిర్వహణలో కరెంట్ షాక్ తగిలి కార్మికులు అవయవాలు, ప్రాణాలు కోల్పోతు న్నారన్నారు. ఏళ్లతరబడి చాలీచాలని జీతాలతో ప్రమాదకరమైన పరిస్థితులలో వీధిలైట్లు కార్మికులు పనిచేస్తు న్నారన్నారు. ప్రభుత్వం నుంచి హెల్త్ అలవెన్స్ గానీ, రిస్కలవెన్స్ గాని కార్మికులకు అమలు కాకపోవడం విచారకరమన్నారు. తక్షణమే ఇంజనీరింగ్ కార్మికులందరికీ హెల్త్ అలవెన్స్ , రిస్క్ అలవెన్స్ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం. అశోక్, స్ట్రీట్ లైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వంశీ, బాలాజీ ఉన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

అచ్చెన్నాయుడుకు 'ఇంటూరి' సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడుని విజయవాడలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వర రావు కలిశారు. కందుకూరు నియోజ కవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల గురించి నాగేశ్వర రావు వివరించారు. ఇంటింటికి మీ ఇంటూరి కార్యక్రమం ప్రజల సమస్యలు తెలుసు కోవడానికి ఉపయోగపడు తుందని, నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో కొనసాగించాలని అచ్చెన్నాయుడు సూచించారు. అచ్చెన్నను ఇంటూరి సన్మానించారు. నెల్లూరు జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్ర పైనా నేతలు చర్చించారు.

జామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి-గుడ్లూరు :మండలంలోని చెట్టు దగ్గర నుంచి రామాయపట్నం వెళ్లే రహదారిలో రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఉన్న జామాయిల్ తోట ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైన సంఘటన బుధవారం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న జామాయిల్ తోటలో మద్యం సేవించిన కొందరు అగ్గిపుల్ల గీసి చేయటంతో నిప్పురవ్వలు అంటుకొని జామాయిల్ చెట్లు దగ్ధం అయ్యాయి. కందుకూరు నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ మంటల్ని అదుపు చేసింది. అప్పటికే 10 ఎకరాలకు పైగా జామాయిల్ చెట్లు కాలిపోవడంతో నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆటో బోల్తా -ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు : అకస్మాత్తుగా వచ్చిన ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలు తగిలిన సంఘటన గుడ్లూరు దగ్గర స్థానిక విద్యుత్ కేంద్రానికి సమీపంలో కందుకూరు గుడ్లూరు రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఆటో బోల్తా పడటంతో ఆటో లోని చెంచు రెడ్డి పాలెం గ్రామానికి చెందిన గౌడ్ పేరు శ్యామ్ అనే ఆటో డ్రైవర్‌కు ధార కాని పాడుకు చెందిన కొండయ్య అనే వ్యక్తికి గాయాలు కావడంతో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆటో ప్రమాదానికి కారణమైన ట్రాక్టరుని స్టేషన్‌కు తరలించారుర.

ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం. శివ నాంచారయ్య బదిలీ అయ్యారు. కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా యంవి రమణయ్య ను నియమిస్తూ ఎస్‌పి ఉత్తర్వులు జారీ చేశారు. రమణయ్య గతంలో ఇదే స్టేషన్‌లో పనిచేశారు. కందుకూరు నివాసి కావడం విశేషం.

బక్రీదు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ గౌరవ మేయర్ స్రవంతి జయవర్ధన్ ముస్లిం సోదరులకు బక్రీదు శుభాకాంక్షలను బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని మేయర్ అభిలషించారు.

యువగళం పాదయాత్రకు ఆదరణ

వెంకటాచలం :నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పాదయాత్ర మండల పరిశీలకులు జెడ్‌పి మాజీ చైర్మన్ చెంచల బాబు యాదవ్, విజయకుమార్ నాయుడు.తెలిపారు. వెంక టాచలంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రిసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సర్వేపల్లి నియోజ కవర్గ టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగే యువగళం పాదయాత్రకు సంబం ధించి గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. సర్వేపల్లి నియో జకవర్గంలో 1వ తేదీన ఎంట్రీవతుందని తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- వలేటివారిపాలెం : రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు (జనుములు) పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. మండలంలోని నేకునాంపురం సచివాలయంలో శింగమనేనిపల్లె గ్రామ రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారం భించారు. ఎఒ మాట్లాడుతూ మండలానికి జనుములు 199, పిల్లిపెసర 21.40, జీలుగ 1.90 క్వింటాళ్ళు వచ్చినట్లు చెప్పారు. వ్యవసాయ సహాయకులు వై ప్రభు, రైతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

విద్యార్థులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు మండల విద్యా శాఖాధికారులు రవికుమార్, వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కొండారెడ్డిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమం బుధవారం ప్రధానోపాధ్యాయులు మన్నం మాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఇఒలు మాట్లాడారు. మండలంలో ప్రతి ఏడాది విద్యార్థులకు అక్షరా భ్యాసం చేయించడం మంచి పద్ధతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులను వివరించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలకు విధిగా పంపాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు ఏడుస్తున్నారనో, తల్లులు పనిలో ఉన్నారనో సెల్‌కు అలవాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇంటి వద్ద కూడా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించాలన్నారు. తొలుత సరస్వతి విగ్రహానికి పూలమాల వేశారు. ఇంకా నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ చైర్మన్ బీరకాయల మాధవరావు, సర్పంచ్ పులి నరశింగరావు, తల్లిదండ్రుల కమిటి చైర్మన్ పులి మాధవరావు, ఉపాధ్యాయులు కంచర్ల గీతా మాధురి, అంగన్‌వాడీ కార్యకర్త బివి రవణమ్మ, పోకూరు హైస్కూలు హెచ్ఎం రవీంద్ర, నలదలపూరు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్షరభ్యాసం చేయిస్తున్న దృశ్యం

ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని పోకూరులో ఎస్‌సి కాలనీ వద్ద ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి టెంకాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిటిసి నూకతోటి విజయలక్ష్మి, వైసిపి నాయకులు నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శిరీష మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం కింద ట్యాంకు నిర్మాణంతో పాటు అవసరమైన చోట్ల పైపులైను, కుళాయిలు నిర్మించేందుకు రూ. 29.66 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. వైసిపి నాయకులు అత్తోట చెన్నయ్య, అత్తోట వెంకటేశ్వర్లు, పర్రె దయాకర్, పర్రె అంకయ్య, కంచర్ల బాలాజీ, పరిటాల వీరాస్వామి, అనుమోలు వెంకటేశ్వర్లు ఉన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

వలేటివారిపాలెంలో ఒక దుకాణంపైకి ఆర్‌టిసి బస్సు దూసుకెళ్లిన ఘటన బుధవారం జరిగింది. ఒంగోలు డిపోకు చెందిన బస్సు పామూరు నుంచి ఒంగోలుకు వెళ్తోంది. ఈ క్రమంలో వలేటివారిపాలెం దాటగానే ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణంపైకి బస్సు దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్‌కు బిపి తగ్గిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అప్పటికే బస్సులోని ప్రయాణికులు అరుపులు చేసినా ఫలితం లేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా అనే విషయమై పరీక్ష చేశారు. మద్యం సేవించలేదని నిర్ధారిం చుకున్నారు. బస్సులోని ప్రయాణికులకు గానీ, దుకాణంలో ఉన్న వారికి గాని ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్యవైశ్యులపై దాడి అమానుషం

ప్రజాశక్తి - కందుకూరు : రాష్ట్రంలో ఆర్యవైశ్యులపై దాడి అమానుష చర్య అని ఐవిఎఫ్ నాయకులు శశికుమార్ పేర్కొన్నారు. బుధవారం గుడ్లూరులో దాడికి గురైన ఆర్యవైశ్యులు ఇన్నమూరి సుధాకర్‌ను ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదెండ్ల వేణుగోపాల్ రావుతో కలిసి పిడుగురాళ్ల నుంచి వచ్చిన ఐవిఎఫ్ నాయకులు శశికుమార్ పరామర్శించారు. వీరితోపాటు అద్దంకి నుంచి వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ ఈసి సభ్యులు తమ్మన శ్రీనివాసులు, సత్యనారాయణ, టంగుటూరు మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ కొత్తూరు రవికుమార్, గుడ్లూరు గ్రామం ఆర్యవైశ్య సోదరులందరూ సుమారు 80 మంది ర్యాలీగా బయలుదేరి మహాత్మా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడనుండి ర్యాలీ నిర్వహించారు. గుడ్లూరు కూడలి లో మానవహారం నిర్వహించారు. తదుపరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కి వినతిపత్రం సమర్పించారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ నిందితున్ని ఎందుకు అరెస్టు చేయలేదని వారు ప్రశ్నించారు. ఎస్ఐ ప్రసాద్ రెడ్డి ముద్దాయిని వెంటనే అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్ఐ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు చీదేళ్ళ వేణుగోపాల్ మాట్లాడారు. కుటుం బానికి అండగా ఉంటామని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావూరి రంగ జనార్ధన్, ఇంకా పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

కూరగాయల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి -పొదలకూరు

కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. టమాటా, మిర్చి ధరలు రూ. 100 పలుకుతున్నాయి. చిక్కుడు, క్యారెట్, కాకర ధరలు అంతే స్థాయిలో ఉన్నాయి. నెల కిందట కిలో టమాటా రూ. పలుకగా నేడు రూ. 100కు చేరింది. మిర్చి నెల కిందట రూ.40 ఉండగా నేడు అక్షరాల రూ. 120 పలు కుతున్నది. క్వాలిటీని బట్టి రూ.150 దాకా మిర్చి ధరలులు ఉన్నాయి. చిక్కుడు కిలో రూ.90 క్యారెట్ కిలో రూ.70, రూ.80, కాకర కిలో రూ.90, బీట్ రూట్ కిలో రూ.50, చీర కిలో రూ.50 రూ. 60 పలుకుతున్న ది కేవలం దోసకాయ మాత్రమే సామాన్యులకు అందుబాటులో కిలో రూ.20 ఉంది.స్థానికంగా పంట అందు బాటులోకి రాకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి కూరగాయ లను దిగుమతి చేసుకోవడంతో రవాణా ఖర్చులు పెరగడంతో రేట్లు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. నెల రోజు లు గడిస్తేగాని స్థానిక పంటలు అందు బాటులోకి రావని, అంతవరకు ధరలు ఇలానే ఉంటాయని చెబుతున్నారు.

'యువగళం' పాదయాత్రలో హరికృష్ణ

ప్రజాశక్తి-కందుకూరు : గూడూరు నియోజకవర్గం లో జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ బుధవారం పాల్గొన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 140వ రోజు గూడూరు నియోజకవర్గంలో జరుగుతుంది. పాదయాత్ర ప్రారంభించే ముందు విడిది వద్ద టిడిపి ఎం ఎల్ సి కంచర్ల శ్రీకాంత్ తో కలిసి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ కలిశారు. ఎం ఎల్ సి ఎన్నికలలో పనిచేసిన తీరుతెన్నులగురించి అడిగి తెలుసుకున్న లోకేష్ గొట్టిపాటి హరికష్ణ ని ప్రత్యేకంగా అభినందించాడు.

అభివృద్ధి పనులు నిలిపివేత సరికాదు

ప్రజాశక్తి-ఉలవపాడు : రూ. 10 కోట్లతో పనులు జరిగిన తర్వాత నిలుపుదల చేయడం బాధాకరమని ఎంఎల్‌ఎ మానుగుంట మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉలవ పాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రూ. 22 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వంలోనే మన్నేటికోట గ్రామంలో స్థలం కేటాయింపు జరిగింద,ఇ అప్పుడే అక్కడ విద్యుత్ కేంద్రానికి పనులు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. లేనిపోని అసత్యాలతో కోర్టుకెళ్లి ఆపుదల చేయడం జరగని పని అన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆయన మండిపడ్డారు.ఉద్యానవన శాఖ వ్యవసాయ శాఖల ద్వారా ప్రజలకు నష్టపరి హారాలు గురించి అధికారులతో సమీక్షించారు. మండల పరిషత్ అధికారిని ఎల్ చంచమ్మ, ఎంపిపి మస్తానమ్మ ,జడ్పిటిసి అరుణ, తహశీల్దార్ బ్రహ్మయ్య, కరేడు వైద్యాధికారి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ రసూల్ బాషా, పిఆర్ఎ ఈ కోటేశ్వరరావు, ఎస్ఐ బాలాజీ రెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి

'మానవత' స్వచ్ఛంద సంస్థ సేవలు

ప్రజాశక్తి-కందుకూరు : మానవత స్వచ్ఛంద సంస్థ కనిగిరి, పామూరు తదితర పట్టణాలలో అనేక సేవాకార్యక్రమాలు చేస్తోంది. రక్త దానాలు, నేత్ర దానాలను ప్రోత్సహించడం, మరణించిన వారి శవాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్సులు, శ్మశానానికి తీసుకెళ్లేందుకు వ్యాన్‌లను ఉచితంగా ఏర్పాటు చేయడం వంటివి సేవలు అందిస్తోంది. కందుకూరులో కూడా ఉచిత ఫ్రీజర్ బాక్సులు నాలుగు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మానవత వ్యవస్థాపక అధ్యక్షులు రామ చంద్రారెడ్డి పలు ప్రయత్నాల్లో భాగంగా కందుకూరు బ్రాంచ్ అతి త్వరలో కమిటీ ఏర్పాటు చేసే ప్రయత్నంలో కందుకూరు మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ని బుధవారం కలిశారు. తర్వాత హిందూ శ్మశాన వాటిక పరిసరాలను పరిశీలించారు. రమణారెడ్డి జాయింట్ సెక్రెటరీ కోమటి గుంట్ల, బాబురావు అధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు ఒమేగా రామిరెడ్డి, పామూరు మానవత కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వర్ రెడ్డి , మానవతా డైరెక్టర్, పోలగ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొ న్నారు. శ్మశాన వాటికి అభివద్ధి గురించి కొన్ని విషయాలు వారితో కలిసి మాట్లాడారు. వారు సహకరించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. హరిణి హాస్పిటల్ డాక్టర్ మల్లికార్జున, రెడ్ క్రాస్ చైర్మన్ చెన్న రామాంజనేయులు , ఎల్‌ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ శశిధర్ రెడ్డి, రమేష్, మానవత కనిగిరి చైర్మన్ కె.వి రమణారెడ్డి ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

క్విజ్ విజేతలు వీరే..

నెల్లూరు :పాఠశాల స్థాయిలో 8, 9,10 తరగతి విద్యార్థులకు ఆర్థిక అక్షరా స్యతను అందిం చాలన్న లక్ష్యంతో ఎస్‌బిఐ జి-20 ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా 'ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల పిల్లలకు అఖిల-భారత క్విజ్‌ను మండల స్థాయిలో ఈ నెల 21వ తేదీన నిర్వహించింది.ఈ పోటీలల్లో 74 మంది విద్యార్థులు ప్రతిభ కనపరి చారు. వీరందరికీ బుధవారం దర్గామిట్ట ప్రాంతంలోని బాలుర ఉన్నత పాఠ శాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో ప్రథమ బహుమతిని ఏఎస్ పేట ప్రాంతం శ్రీకొలను ప్రాంతం జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఎన్ జ్యోత్స్న, టి.ప్రవీణ్ కుమార్ కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతిని అనంతసాగరం మండలం, చిలకలమర్రి జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన కె.జ్ఞానేష్, వై.హారికలు సొంతం చేసు కున్నారు. తృతీయ బహుమతిని టి.పి గూడూరు జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు సిహెచ్ విజ్ఞాన జోషిక, ఓ. జిషిత లు దక్కించుకున్నారు. ఈ క్విజ్ పోటీలలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లు అందజేశారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో ప్రతిభను కనపరిచిన జట్లకు సర్టి ఫికేట్లను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జెడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ అందజేశారు. కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశాల మేరకు కెనరా బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ టి. శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, డిఇఒ గంగా భవానీ ఉన్నారు.

ఐటిడిఎ ప్రాజెక్టుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కావలి : ఐటిడిఎ ప్రాజెక్టుపై నిరుపేద గిరిజనులు అవగాహన పెంచుకొని అభివృద్ధి చెందాలని జిల్లా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎం.మారకుండా రెడ్డి కోరారు. జిల్లాలోని కావలి డివిజన్ గిరిజన కాలనీలను ఆయన సందర్శించి వారి జీవనం విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజన కాలనీకి సామాజిక భవనాన్ని నిర్మించి, గిరిజన కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కాలనీలో బడి బయట కూడా బాలబాలికలు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమాజానికి దూరంగా అభివృద్ధికి దూరంగా జీవిస్తున్న గిరిజనులు సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. దీనికి అధికారులు ప్రజాప్రతినిధులు, పౌర సమస్యలు, నిరంతరం గిరిజనులను చైతన్యపరిచి ప్రగతి బాటలో నడిపించాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రం స్థానిక గాంధీ కాలనీ తదితర కాలనీలలో బుధవారం కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడప గడప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను విరివిగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మరొక్కసారి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : ఎన్నికలొస్తున్నాయంటేనే టిడిపికి దళితులు గుర్తొస్తారని ఎంఎల్‌ఎ నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని యల్లాయపాలెం మజర రామాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, ఎంపీపీ జి. జ్యోతి, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్ రెడ్డి, అడపాల మోహన్‌కృష్ణ, నల్లావుల శ్రీనివాసులు, మారం రెడ్డి, రంగారెడ్డి, తాడిపర్తి భాస్కర్ రామిరెడ్డి, రాజేష్ రెడ్డి, కే.వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పొదుపు కార్యాలయంలో 'క్రెడిట్ క్యాంపు'

ప్రజాశక్తి-సంగం : సంగం పొదుపు కార్యాలయంలో బుధవారం డిఆర్‌డిఎ బ్యాంక్ లింకేజ్ డిపిఎం చంద్రశేఖర్ క్రెడిట్ క్యాంప్ నిర్వహించారు. క్రెడిట్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా పొదుపు సభ్యులకు వ్యక్తిగత రుణాలు మంజూరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంక్ మేనేజర్ సందీప్ రెడ్డి, ఎపిజిబి మేనేజర్ బాలకృష్ణ రెడ్డి పాల్గొని వ్యక్తిగత రుణాల మంజూరుకు సంబంధించి అర్హతలు, అనర్హతల గురించి పొదుపు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా డిపిఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ పొదుపు సభ్యులు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యక్తిగత రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. పొదుపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి, సిసిలు పాల్గొన్నారు.

బక్రీద్ వేడుకలను ప్రశాంతంగా చేపట్టాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : బక్రీద్ వేడుకల్లో ప్రశాతంగా నిర్వహించాలని సిఐ వి.గిరిబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిఐ కార్యాలయంలో మసీదు పెద్దలకు పంచాయతీలోని పలువురు ముస్లిం పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ఉదయగిరి సీతారాంపురం దుత్తలూరు వరికుంటపాడు మండలాల్లో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ క్రమంలో కుర్బానీ చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని సూచించారు. మత పెద్దల సమక్షంలో ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలను ఆపాలి

ప్రజాశక్తి-సంగం : సంగం ఇసుక రీచ్ వెళ్లే రహదారిలో బీరాపేరు వంతెన వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఇసుక వాహనాలు రీచ్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. భారి ఇసుక వాహనాలతో వంతెనతో పాటు పొలాలకు వెళ్లే రహదారులు దెబ్బ తింటున్నాయన్నారు. పెన్నా పోర్లు కట్టలను సైతం తవ్వేస్తుండటంతో తమ పొలాలు దెబ్బతింటున్నాయని అవేదన చెందారు. అధికారులకు రీచ్ నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యను అధికారులు పరిష్కరించాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన



ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ జరుగుతున్న జగనన్న విద్యా కానుక మధ్యాహ్న భోజనం, మనబడి నాడు-నేడు ఫేస్ -2 పనులను విద్యాశాఖ అధికారులు తోట శ్రీనివాసులు, షేక్ మస్తాన్ వలీ తనిఖీ చేశారు. బుధవారం స్థానిక షబీర్ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు సందర్శించి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అలాగే ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ మండలంలోని వెంకటాపువపల్లె గ్రామంలో జరుగుతున్న మనబడి నాడు-నేడు అదనపు గదుల పనులను పరిశీలించారు. పనులు నాణ్యత చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనం రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మున్నా ఫరూఖ్, బలరామ్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-వరికుంటపాడు : అధికారులు ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, అందులో ఏదైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సబ్ కలెక్టర్ శోభిక పేర్కొన్నారు. మండలంలోని తోడేరు చెరువుపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు మున్ముందు వలంటీర్లను విధుల నుండి తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, పశుసంవర్ధక శాఖ సహాయకుడు అదును మల్లి వెంకటేశ్వర్లు, సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంపిడిఒ విజయభాస్కరరావుకు, షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎవరైనా సరే నిర్లక్ష్యం చేయకుండా ఎవరు పనిచేసినా ప్రభుత్వం నిర్దేశించిన పనిని సాధించాలని సహించేది లేదని ఆమె అధికార తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కావలి : ప్రముఖ వ్యాపారవేత్త బిపిసిఎల్ అధినేత బెజవాడ ప్రసాద్ - శకుంతలమ్మ దంపతులు సంయుక్త సేవాసంస్థ ద్వారా సంరక్షిస్తున్న 'ఈశ్వర్'కు బుధవారం వెంగళరావు నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఘనంగా పుట్టినరోజు వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్నాంజనేయులు, గౌరవ సభ్యులు విశ్రాంత లెక్చరర్ ఎమ్ఎవిఎస్ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని ఈశ్వర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు.

సిఐ గిరిబాబుకు సన్మానం



ప్రజాశక్తి-ఉదయగిరి : ఉత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు గ్రహీత సిఐ గిరిబాబును పలువురు నాయకులు సన్మానం చేశారు. బుధవారం స్థానిక సిఐ కార్యాలయంలో విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉదయగిరి సిఐ వి.గిరిబాబుకు సర్పంచ్ సంఘం అధ్యక్షులు కల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బిరుదుల జాషువా నాయకులు పూల బుకే శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ నిబద్ధత విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకున్న సిఐకు ఇలాంటి అభినందనలు ప్రశంసా పత్రాలు అవార్డులు రావడం చాలా గర్వంగా ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పాతబిట్రగుంటకు ఆర్‌టిసి వారి సౌజన్యంతో సుదూర ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించారు. ఈ బస్సు రెండు ప్రాంతాల నుంచి వస్తుంది. మంగమూరు, కడనూతల కొండ బిట్రగుంట మీదుగా బిట్రగుంటకు వస్తుంది. రెండో బస్సు తాళ్లూరు నుండి బయలుదేరి కండ్రిక చైతన్య నగర్, చెంచులక్ష్మి పురం, బోగోలు కొత్తూరు, కొండ బిట్రగుంట మీదుగా రాకపోకలు జరుగుతాయి. ఈ బస్సు సౌకర్యాన్ని విద్యార్థి విద్యార్థులు తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ఈ బస్సు సౌకర్యం కల్పించడం కోసం సహకరించినందుకు ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండల విశ్వనాధరావుపేట పంచాయతీలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న వై.చెంచులక్ష్మిని ఉపాధ్యాయులు ఇందిరా, సుభాషిని, గౌరీ, నిరూపమలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి ఉప విద్యాశాఖ అధికారి ఎం.ఆర్ ప్రసాద్, బదిలీపై వెళ్తున్న విద్యా శాఖ అధికారి ఆయుబ్ ఎంఇఒ జయమ్మ, ప్రధాన ఉపాధ్యాయుడు గంగాధర్, కావలి ఎంఇఒ, శ్రీధర్, దగదర్తి ఎంఇఒ భాస్కర్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో రైతుల సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని, రైతుల సమస్యల పరిష్కారానికి జూన్ 30న విజయవాడలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలను ఆర్‌బికె కేంద్రాల ద్వారా మద్దతు ధర ఇస్తామని రైతులను చాలా ఇబ్బంది

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెడుతున్నారని, రైతులు పండించిన పంటకు కనీసం పెట్టుబడి కూడా ప్రభుత్వం అందించలేకపోతుందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో పాడి రైతులకు పాలకు నాలుగు రూపాయల లీటర్ సబ్సిడీ ఇవ్వాలని, కోవూరు సుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరవాలని తెలిపారు. ముత్తుకూరు నుండి హైదరాబాద్ వరకు వేస్తున్న పైప్‌లైన్ భూమికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, మండలాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక తహశీల్దార్‌తో కమిటీని నియమించాలన్నారు. బోగోలు మండలంలో ఉన్న ఇనాం భూములపై పేదలకు అన్యాయం చేసి అధికార పార్టీ నాయకులకు అంటకంటే ప్రయత్నం చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్,, మండల సిపిఎం పార్టీ కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి, మండల రైతు నాయకులు గడ్డం వెంకయ్య, భాస్కర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ

ప్రజాశక్తి-కావలి

కావలి రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సి.హెచ్. దినేష్ కుమార్, పుట్టా మోహన్‌కుమార్ రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ ఎండ్ పోలియో కో - ఆర్డినేటర్ పి.డి.జి. దొడ్ల భరత్ కుమార్ రెడ్డి స్థానిక వెంగళరావు నగర్‌లోని రోటరీ క్లబ్‌లో వారిరువురితో ప్రమాణ స్వీకారం చేయించి, సంబంధిత బాధ్యతలు అప్పగించి, రోటరీ మెడల్స్ అలంకరించి సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఒమ్మిన సతీష్ బాబు, ఇంటర్ ప్రాజెక్ట్ కౌన్సెలర్ పి.డి.జి.బి. సురేంద్రరెడ్డి, డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ చైర్మన్ పి.డి.జి.కె.ముని గిరీష్,

అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న భరత్‌కుమార్ రెడ్డి

సింహపురి జోన్ అసిస్టెంట్, గవర్నర్ ఎ.భాను మతి, రీజినల్ కో ఆర్డినేటర్ డా కె.మాధవరెడ్డి, గత సంవత్సరం అధ్యక్ష, కార్యదర్శులు వి.జయ చంద్ర నాయుడు, శ్రీరామ్ విష్ణువర్ధన్, ప్రస్తుత కోశాధికారి ఎం.వెంకటసుబ్బయ్య, సీనియర్ రొటేరియన్లు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లిలో ఉన్న పంచముఖ శక్తి గణపతి ఆలయంలో ఉదయగిరి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి బుధవారం ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : పురపాలక సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఎంజిఆర్ సమావేశ మందిరంలో చెర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని 22 అంశాలు ఎఇ ప్రసాద్ చదివి వినిపించారు. పురపాలకంలోని రెండవ వార్డు డంపింగ్ యార్డ్ వద్ద షెడ్డు నిర్మాణం బోర్ వెల్ పనుల కోసం ఇప్పటికే టెండర్లు వేసి ఉండగా వాటిలో తక్కువ ధరకు కొటేషన్ దాఖలు చేసిన వారికి పని అప్పగించేలా తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. వార్డులలో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మిగిలి ఉన్న పనులను పూర్తి చేయడం చేత పంపులు మరమ్మతులు నిధుల కేటాయింపు పాత బోరు మోటర్లు స్థానంలో నూతన మోటార్ పంప్ సెట్‌ల ఏర్పాటు పనులను పూర్తి చేయడం ఇతర పనులతో పాటు మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని పూల దుకాణం మూడు సంవత్సరాలు లీజు వేలంపాట తదితర పనులకు సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. 20వ వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అస్తవ్యస్తంగా పురపాలకం తయారైందని విమర్శించారు. మూడో వార్డు కౌన్సిలర్ గౌస్‌బాషా, భాస్కర్‌రెడ్డిలో అభ్యంతరం తెలపడంతో వైసిపి కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, తోకల తిరుపతమ్మ స్పందించి ఘటైన సమాధానమిచ్చారు. తోకల తిరుపతమ్మ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సొంత నిధులతో అత్యాధునిక బస్టాండ్ బస్టాండ్ నిర్మాణం చేపట్టారన్నారు. కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ అంతర్గత సిమెంట్ రోడ్లు సచివాలయ నిధులతో మున్సిపల్ వార్డులలో పనులు జరుగుతున్నాయని హిందూ శ్మశాన వాటిక రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చైర్ పర్సన్ గోపాల వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులకు గ్లౌజులు దుస్తులు ఆయిల్ తదితర ఉపకరణాలతో పాటు చెత్త సేకరించేందుకు ప్లాస్టిక్ బుట్టలను త్వరలోనే అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఆర్.ఖాసిం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్క దాడి

ప్రజాశక్తి-వరికుంటపాడు : ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిపై కుక్క దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలోని తూర్పు చెన్నంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రెండవ తరగతి చదువుతున్న బక్క సంజయ్ 7(సం) పాఠశాల ఆవరణంలో భోజనం తిని లోపలికి వెళ్లే సమయంలో కుక్క దాడి చేసింది. పిల్లలు వెంటనే ప్రధానోపాధ్యాయుడికి తెలియపరచగా అతను వెంటనే వచ్చి హక్కున చేర్చుకుని రక్తస్రావం అవుతున్నా గాయాన్ని గుడ్డతో సరిచేస్తూ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం 108 సహాయంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

చంద్రబాబుతోనే ఎపి అభివృద్ధి

ప్రజాశక్తి-కొడవలూరు : భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథం కొడవలూరు రేగడిచిలక గమేష్ ఫ్యాక్టరీ దగ్గర సెల్ఫీ పొలంరెడ్డి దినేష్ రెడ్డి ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కోవూరు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందంటే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హయాంలోనే అని తెలిపారు. కార్యక్రమంలో పనబాక లక్ష్మి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల అధ్యక్షుడులు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, వీరేంద్ర, చెముకుల చైతన్య, చెక్క మదన్‌మోహన్‌రావు, రవిచంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనరల్ ఫండ్‌ను వినియోగించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, షాపులు, వాణిజ్య సముదాయం, రోడ్డు మార్జిన్ షాపుల నుండి వసూలు చేస్తున్న పనులను తదితర వనరుల నుండి వసూలు చేస్తున్న నగదును మున్సిపాలిటీ జనరల్ ఫండ్‌గా ఉంచి మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా జీతాలు ఇచ్చే విధంగా బాధితులను వినియోగించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు గౌరవాధ్యక్షులు జివి శివప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులను ఇతర పనులకు ఉపయోగించకుండా నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజల ఆరోగ్యానికి హాని కలగకుండా, వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యానికి ఆత్మకూరు మున్సిపాలిటీ నిరంత కషిలో ప్రధాన భాగంగా ఉండి పనిచేస్తున్న కార్మికులకు వారి జీతాలు ప్రతినెలా చెల్లించేందుకు

కమిషనర్‌కు వినతినిస్తున్న సిఐటియు నాయకులు

భవిష్యత్తులో అవరోతం లేకుండా జనరల్ ఫండ్ నిధులపై తమరు తగు చర్యలు తీసుకుని కార్మికులకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కి తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.నాగేంద్ర, సిఐటియు ఉపాధ్యక్షులు కే.డేవిడ్ రాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు రిజ్వాన్, గురవయ్య, చెన్నకేశవులు, తదితరులున్నారు.

అధ్యాపకుల కొరతతో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరతతో అరకురా వసతులు విద్యార్థులను వెక్కిరిస్తున్నాయి. వివరాల్లోకెళితే.. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది హై స్కూల్ ప్లస్‌ను బాలికల కోసం నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. అయితే ఆలస్యంగా ప్రారంభించడంతో 26 మంది బాలికలు కళాశాలలో చేరారు. అధ్యాపకుల కొరతతో అరాకొర వసతులతో వసతుల నడుమ బాలికలు ఉద్యమం అభ్యసించారు. ప్రథమ సంవత్సరం ఫలితాలు దారుణంగా విద్యార్థులకు రావడంతో విద్యార్థులు తల్లిదండ్రులు నిరుత్సాహపడ్డారు. ఈ విద్యా సంవత్సరం కూడా 30 మంది బాలికలు చేరి అధ్యాపకులు లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రయివేటు కళాశాలలో చేరారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం బాలికలు 26 మంది అలాగే ప్రథమ సంవత్సరం బాలికలు పదిమంది ఉన్నారు. ప్రస్తుతం కళాశాలలో తెలుగు, కెమిస్ట్రీ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. అధ్యాపకుల గురించి ప్రధానోపాధ్యాయులను సంప్రదించగా ప్రభుత్వ యాజమాన్యంలో ఉపాధ్యాయులు కొరత కారణంగా అధ్యాపకులుగా రావడానికి ఎవరు ఆసక్తి చూపలేదని అందువలన అధ్యాపకులు లేరని

నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాల

తెలిపారు. తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని తెలిపారు. కళాశాలలో చేరిన బాలికల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ అధికారులు పాలకులు ఈ కళాశాల పరిస్థితిని గమనించి అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే గవర్నమెంట్ హైస్కూల్లో ఉన్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుని సాధారణ బదిలీల్లో భాగంగా వేరే పాఠశాలకు బదిలీ కాపడ్డారు ప్రస్తుత పాఠశాలలో ఇంగ్లీష్ బోధించడానికి ఉపాధ్యాయులు లేరు ఫిజిక్స్ సోషల్‌కు ఒక్కొక్కరే ఉన్నారు. ఈ పాఠశాలలో 400 మంది విద్యార్థులు పైగా వ్యాసం చేస్తున్నారు, ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికనైన అధ్యాపకులను ఉపాధ్యాయులను నియమించాలని కోరుకుంటున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు వైఎస్ఆర్ కంటి వెలుగు పరీక్షలను బుధవారం ప్రధానోపాధ్యాయురాలు పి.పద్మలత ఆధ్వర్యంలో ఆప్తలిక్ అసిస్టెంట్ కోటేశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆప్తలిక్ కోటేశ్వరావు మాట్లాడుతూ టీవీ సెల్‌ఫోన్లు దగ్గర పెట్టుకొని చూడడం, కంటి చూపు పిల్లలకు కొంత మందగిస్తుందన్నారు. అలాగే ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురైన పిల్లలకు తలనొప్పి రావడం జరుగుతుందని, పౌష్టికాహార లోపం కారణంగా కంటి చూపు కొంత తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా విద్యార్థులకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కంటి పరీక్షల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిపి దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా అనేక సమస్యలను పరిష్కరించవచ్చని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన వరవడులతో ప్రజల కోసం సరికొత్త నిర్ణయాలు తీసుకుంటుందని హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాల వద్ద పెరిగిన చెట్లను తొలగించాలని కోరారు. అలాగే శానిటైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీదేవి, మండలం ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర, పలువురు అధికారులు సర్పంచ్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక వైసిపి కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం అమలుపై వైసిపి మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కురుపాంలో బుధవారం విద్యార్థులకు నాల్గవ ఏడాది అమ్మఒడి పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నగదును తల్లిదండ్రుల ఖాతాలలో జమచేశారు. వైసిపి పాలనలో ఎన్నో బృహత్తరమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి నియోజక వర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఎంజిఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.4.50కోట్లతో బస్టాండ్ నిర్మించారని, ఉదయగిరిలో రూ.250కోట్ల విలువ చేసే ఇంజనీరింగ్ కళాశాలను, కృష్ణాపురంలో జవహర్ నవోదయ విద్యాలయానికి స్వంత భూములను ఇచ్చారన్నారు. జగనన్న సురక్ష పథకంలో వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించి వారికి సంక్షేమ పథకాలు అందించటంతో పాటు అవసరమైన కీలక ధ్రువీకరణ పత్రాలను అందించడమే జగనన్న సురక్ష ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి కోనంకి శ్రీనివాసులు నాయుడు, ఎంపిటిసి హజరత్ రెడ్డి, సోషల్ మీడియా ఓంకారం శివ, చంద్ర నారాయణస్వామి, జయరామిరెడ్డి, సర్పంచ్ గుర్రం తిరుపాలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జగనన్న సురక్ష ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఎంపిడిఒ ఐజాగ్‌ప్రవీణ్ తెలియజేశారు. బుధవారం మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాలెం సచివాలయ పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపిడిఒ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అంతేకాకుండా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్స్ అప్లై చేసుకున్న వారికి ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అర్హత కలిగి ఉండి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జూలై 6వ తేదీన అప్పారావుపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీనికి వారం రోజులు ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. నమోదు చేసుకున్న ప్రతి అంశానికి సంబంధించి సంబంధిత అధికారుల ద్వారా పరిష్కార వివరాలు లబ్ధిదారులకు తెలియజేస్తాన్నారు. జూలై 6న జరుగునున్న కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని లబ్ధి పొందే విధంగా ఈ కార్యక్రమం గురించి సచివాలయ పరిధిలో విస్తృతంగా ప్రచారం



మాట్లాడుతున్న డాక్టర్ ఆది శేషయ్య

నిర్వహించి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఆత్మకూరు జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య అన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపాలిటీలోని 17, 19, 20 వార్డుల సచివాలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష ప్రోగ్రామ్‌కి సంబంధించిన విధి విధానాలపై వాలంటీర్లకు, గృహ సారథులకు, వైసిపి నాయకులు జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, 19, 20 వార్డుల కౌన్సిలర్లు కొండా స్వరూపారాణి, సూరా భాస్కర్ రెడ్డి, 19వ వార్డు ఇన్‌ఛార్జి కొండా వెంకటేశ్వర్లు తదితరులున్నారు. అనంతరం వైస్‌చైర్మన్ షేక్ సర్దార్ డాక్టర్ ఆదిశేషయ్యను శాలువాతో సన్మానించారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

- రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రాజ్యసభ సభ్యులు, జిల్లా వైసిపి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగను ముస్లీం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమస్యలకు భయపడకుండా దేవునిపై విశ్వాసం నుంచి సన్మార్గంలో జీవించాలని ఈద్ అల్ అదా తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలపై ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఏకాదశి, బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని హిందూ-ముస్లిం సోదర సోదరీమణులకు తొలి ఏకాదశి, బక్రీద్ పండుగల శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్లు మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పి సి అల్లూరు రాజు తెలిపారు. తొలి ఏకాదశి బక్రీద్ పండుగలు ఒకేరోజు రావడం సంతోషకరమని హిందూ-ముస్లిములు అన్నదమ్ముల్లాగా ఈ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని వారు కోరారు.

మేకపాటి రాజారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మేకపాటి రాజారెడ్డిని కల్లూరు వెంకటేశ్వర రెడ్డి నియోజకవర్గ వైసిపి నాయకులు పూల బుకేతో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. బుధవారం నియోజకవర్గ

రాజారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పరిధిలోని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాజీ ఎంపి రాజమోహన్ రెడ్డి అభ్యర్థనకై రాజారెడ్డిని పరిశీలిస్తున్న నియమించడం ఆశించదగ్గ విషయమని ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి రాజారెడ్డికి అభినందనలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టనున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు గడపగడప పర్యటనపై సుదీర్ఘంగా పలు అంశాలపై చర్చించారు. త్వరలోనే నియోజకవర్గంలో గడపగడప పర్యటన మేకపాటి రాజమోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రతి గడపగడప పర్యటన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు కష్టారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VII[th] ADDL. DISTRICT JUDGE, GUDUR
GUARDIAN O.P.No. 28 / 2023

(In the Mater of the Estate of father being a Minor by name **Ravula Charan,** S/o Late **Ravula Harinad Babu,** Hindu, aged 15 years at D.No. 4/6/53, Soniyagandhi Nagar, Near Teja High School, Sullurupet, Tirupathi District.)

1) Ravula Kasthuri, (Natural Guardian) W/o Late **Ravula Harinad Babu,** Hindu, aged 41 years, House wife,
2) **Ravula Pallavi,** D/o **Ravula Harinad Babu,** Hindu, aged 21 years, occ. MBBS 4th Year Student, S.V. University, Both are residing at D.No. 4/6/53, Soniyagandhi Nagar, Near Teja High School, Sullurupet Mandal, Tirupathi District. ... Petitioner

Vs

Nill ... Respondent

జనరల్ నోటీసు

పై పిటిషన్‌లో పిటిషనర్లు అయిన మొదటి పిటిషనరు భర్త 2, 3 పిటిషనర్లుకు తండ్రి గారు అయిన **రావుల హరినాధ్ బాబు** మరణించినందున ఆయన పేరుతో ఉన్న పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్థిని **రావుల శేషమ్మ** మరియు ఇతరులకు అమ్ముటకు మరియు ఆసని అమ్మగా వచ్చిన ప్రతిఫలమును **నేషనల్ బ్యాంక్‌లో** డిపాజిట్టు చేయుటకు తల్లిగారు అయిన 1వ పిటిషనరును గార్డియన్‌గా నియమించమని పై కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఆక్షేపణలు నిమిత్తం **తే08-09-2023దిన** వాయిదా వేసివున్నారు. కావున ఎవ్వరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** హాజరై ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేనియెడల కేసు పరోక్షమున తీర్మానించబడును.

SCHEDULE

Item No.1. Nellore Dist Registration, Present Tirupati District, Tirupati District Registration, Gudur Sub-Registration, Griddaluru Grama Panchayat, Sydapuram Mandal, Old Khatha No. 327, New Khatha No. 2626, S.No.120, Total extent 11-74, each one allotted Ac. 5-87 cents, she sold away property Ac.3-00 cents out of 5-87 cents is bounded by:- **East :** Common path way of both parties, **South:** Remaining land of Ravula Sudhakar, **West:** Land of Aluru Krishnaiah and Suneel, **North:** Land of myself.
Item No.2. Nellore Dist Registration, Present Tirupati District, Tirupati District Registration, Gudur Sub-Registration, Griddaluru Grama Panchayat, Sydapuram Mandal, Old Khatha No. 167, S.No.124, Total extent 5-87 she sold away property Ac.0-81 1/2 cents out of 1-63 cents is bounded by:- **East :** Land of Aluru Krishnaiah Naidu, **South:** Land of Ravula Sudhakar, **West:** Kaluva, **North:** Land of Grandhi Tirupalu.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
బందా శ్రీనివాసులు
షేక్.నాగూర్
అడ్వకేట్స్, నెల్లూరు. సెల్: **95508 19473**